గురజాడ వీధి


# ఇదో సినిమా వాలే కథ!!

—కాశీవిశ్వనాథ్

ఉన్నట్టుండి పుల్లివిపిల్ల సుబ్బయ్యనాయుడు సినిమా తీస్తున్నాడన్న వార్తపేపల్లో వచ్చేసింది!

ప్రొడక్షన్ మేనేజర్ సినిమా ప్రొడ్యూసరవడం, పెద్దబ్రహ్మవిద్యేం కాదు కాబట్టి ఆ వార్త వినగానే ఆకాశం అదిరిపోలేదు. భూదేవి బద్దలై పోలేదు. కాకపోతే ఆ సినిమాకి కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్‌కూడా సుబ్బయ్యే చేస్తున్నాడని ప్రకటించేసరికి చాలామంది చోటామోటా





సినిమా పీపుల్స్ చిరాగ్గా ఒళ్లంతా గోక్కున్నారు. "ఆడిమొకం, ఆడికి తెలుగులో సంతకం ఎట్టడమే సరిగా రాదు. ఆడిబతుక్కి, కత, మాటలు, పాటలు రాయడం, పైగా డైరెక్షనూ చెయ్యడమా?" అంటూ అతని 'గ్లాస్‌మేట్స్' (అనగా రాత్రివూట మందువేసుకునేటప్పుడు గ్లాసుల్తో చీర్స్ చెప్పకునే ఫ్రెండ్సుని గ్లాస్‌మేట్స్‌గా సినిమా రంగంలో అర్థం చేస్కోవలెను) అతని సినిమా గురించి ఆరాలు తీసారు.

'కాకినాడ కళారంజని' ఆంధ్రా, సీడెడ్, నైజామ్ ఏరియాలో తిరుగులేని రికార్డింగ్ డేన్సరు. సుబ్బయ్యదీ, కళారంజనిదీ ఒక్క వూరే! "బావా నన్ను సినిమా ఫీల్డులోకి దింపెయ్యవా, దింపెయ్యవా" అంటూ ఉత్తరంమీద ఉత్తరం రాసేసరికి చివరికో రోజున ఆవిణ్ణి హైదరాబాద్‌లో దింపేడు. తర్వాత సినిమా ఫీల్డులోకి దింపేసాడు. ఆవిడ కాకినాడ నించి హైదరాబాద్‌కి దిగుమతి అయ్యేముందు ఓ సంవత్సరం పాటు దుబాయ్, గిబాంకు లాంటి గల్ఫ్ కంట్రీస్‌లో రికార్డింగ్ డేన్సులుయిచ్చి ఓ సూట్‌కేసుడు సొమ్ము మోసుకొచ్చిందట. గల్ఫ్ కంట్రీస్‌లో గెంతులువేసి అంత సొమ్ము సంపాదించలేదు, చాలా బిజినెస్సులు చేసి, దుబాయ్ షేకుల్తో చేతులు కలిపి అంత సొమ్ము సంపాదించిందని కొంతమంది వాగినా అందులోని సత్యాసత్యాలగురించి మనమేం నిజనిర్ధారణ కమిటీలనేం వెయ్యక్కర్లేదు. మొత్తం మీద ఒంటినిండా బంగారంతో, సూట్‌కేసునిండా డబ్బుతో హీరోయిన్ అయిపోవాలనే ఆశతోనే, సిన్మాఫీల్డులోకి దిగిపోయింది. ఆవిణ్ణి హీరోయిన్‌గా పెట్టే సుబ్బయ్య ఇప్పడు సినిమా తీస్తున్నాడు. ఓ ప్రొడక్షన్ ఆఫీసు అద్దెకు తీసుకుని తన కంపెనీకి 'కళారంజని ఫిలిమ్స్' అని పేరు రిజిస్ట్రేషన్ చేయించాక, భారీ ఎత్తున ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశాడు! రేపు ప్రెస్‌మీట్ అనగా ఇవాళ కళారంజనిని కూర్చోబెట్టి రేపు ప్రెస్‌మీట్‌లో ఏం చెప్పాలో కాస్త తర్ఫీదిచ్చాడు.

"మీది ఏవూరు? అని అడుగుతారు. అప్పడేం చెబుతావ్?"

"కాకినాడ దగ్గరున్న గంగోరం అని సెప్తేత్తాను" అంది కళారంజని ఓ చిత్రమైన యాసతో. అది ఒక జిల్లాకు సంబంధించిన యాస కాదు. ఆవిడ ఈ రాష్ట్రంలోని జిల్లాలు. ఈ దేశంలోని రాష్ట్రాలతో పాటు గల్ఫ్ కంట్రీస్, గిల్ఫ్ కంట్రీస్‌అని సుడిగాలిలా చుట్టుకొచ్చెయ్యడం వల్ల ఆవిడ మాటల్లో అన్ని రకాల అక్షరాలు వినిపిస్తుంటాయ్. డాక్టరురాసిన మందు చీటీ, ఒక్క మందుల కొట్టు యజమానికే



●●

'అపియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నమోదైన ఆశియా ఖండ విశిష్ట వ్యక్తి, ప్రముఖ నాటక, సినీ రచయిత, నటుడు

**శ్రీ కాశీ విశ్వనాథ్**

ఆంధ్రజ్యోతి కోసం ప్రత్యేకంగా రాసిన స్టోరీ

●●

గురజాడ వీధి శీర్షికలో ఒకప్పటి ఆంధ్రపత్రిక ఎడిటర్ సాహితీవేత్త

**శ్రీ వీరాజీ**

రాసిన హనీమూన్ ఎక్స్‌ప్రెస్ కథ వచ్చే సంచికలో

అర్ధమయినట్టు ఆవిడ మాటలు ఒక్క సుబ్బయ్య నాయుడికే అర్ధమవుతాయి. ఆవిడకి ప్రస్తుతం తెలుగు సినిమా ఫీల్డు గురించి మూడుముక్కల్లో చెప్పేడు.

"నువ్వు అచ్చమైన తెలుగుపిల్లవని చెప్పేవనుకో, నీకు వేల్యుయేషన్ వుండదు. స్కాచ్ విస్కీకుంటే వేల్యూ ఇండియా విస్కీ కుంటాదా? వుండదు. నువ్వు పుట్టింది పాకిస్థానా, పెరిగింది రాజస్థానా, నీ మదరేమో మరాఠీ, ఫాదరేమో పంజాబీ అన్జెప్పు. గల్ఫ్ కంట్రీస్‌కి తరుచుగా వెళుతుంటారట ఎందుచేత అని ఎవరైనా అడిగితే అక్కడ మా పేరెంట్స్‌కి ఆయిల్ బిగినీస్ అని చెప్పు. తెలుగు కొద్దికొద్దిగా వచ్చు అనిచెప్పు. నీ వాల్యూ బాగా పెరిగిపోద్ది"

కళారంజనీకి, చిన్న అనుమానం వచ్చింది. "నాకు తెలుగు సరీగా రాదంటే, మిగతా ప్రొడ్యూసర్లు నన్ను బుకింగ్ చేసుకోరేమో" అంది.

"పాతరోజుల్లో అయితే అంతే. పెద్దవాళ్ళి, బా, బిలాగుల్ని నక్కకా పలకడం, మొఖంలో ఫీలింగుల్ని, సుబ్బరంగా చూపెట్టడం, ఇలాంటివన్నీ సక్కగా వస్తేనే ఆళ్ళని హీరోయిన్లుగా తీస్కునేవాళ్లు. నీకు తెల్దుగాని,

నీకు తెల్దుగాని, ఎనకటి రోజుల్లో వెండి రూపాయలుండేవి. అనిచెలామణికి రాకుండాపోయి చాన్నాళ్ళైందనుకో!! పాత ఏక్టర్లంతా వెండి రూపాయల్లాంటోళ్లు. ఇప్పుడు వస్తున్నోళ్ళంతా, దాదాపు నీలాంటోళ్లే కాబట్టి నువ్వు ఎంత తెలుగు దానివి కాకపోతే నీకంత డిమాండ్ వచ్చేస్తాది. తర్వాత ఆలిండియా హీరో అమితాబచ్చన్ అంకుల్ నిన్ను ఎన్నిసార్లు సినిమాల్లోకి ఎల్లిపోరమ్మన్నా, నేనురానుగాక రానన్నానని చెప్పు! నీ వేల్యూ మరింత పెరిగిపోద్ది"

కళారంజనీ అతన్ని కాస్త వెటకారంగా చూసి "ఏం నీకంటికి నేను ఎర్రిదాన్లా అవుపిస్తన్నానా? అబద్దం ఆడినా అతికినట్టుండాల. నేనెక్కడ? అమితాబచ్చనెక్కడ? అతగాడు నన్నెందుకు పిలుస్తాడు? ఒకేళ ఆళ్లకి డౌట్‌వచ్చి ఆయనకి ఫోనేచేసి కనుక్కుంటే నా బండారం బైటపడిపోదా?" అంది. "అక్కడే నీకూనాకు తేడావుందిమరి. నువ్వెప్పుడు కోతకోసినా చాలా పెద్దోడి పేరుతో కలిపే కోత కొయ్యాల. నువ్వు అమితాబచ్చన్ గురించి కోత కోస్తే మాత్రం, ఆమాట రైట్ అనునోకాదో యీ జర్నలిస్టులు అతగాడికి ఫోన్‌చేసి, నిజానిజాలు కనుక్కుంటారనుకున్నావా? తెల్లారిలేస్తే నీలాంటోళ్ళని ఎంతమందినో చూస్తుంటారు. అంచేత ఆళ్లునమ్మరు. అయినా నువ్వు చెప్పిన మాటే, మర్నాటి పేపర్లో వచ్చేస్తాది..."

అంటూ సుబ్బయ్యనాయుడు ఆవిడకి సినీమా రంగంలోని చిట్కాల గురించి, ఓ గంటసేపు బోధించాడు. తర్వాత మరో మూడుగంటలు.



## వాళ్ల మధ్య 'ఏదీ' లేదట

కాలు విరిగి కొన్నాళ్లు మూల కూర్చున్న బాబీడియోల్ ఆ సమయాన్ని బానే సద్వినియోగం చేసుకున్నాడని గిట్టనివాళ్ల పుకారు. మోడల్ రక్షందా ఖాన్‌తో కిరికిరి నడుపుతూ ఆక్కా - బక్కుం చేసేశాడని బాలీవుడ్‌లో వొకటే గోల. ఆమాటే అడిగితే "ప్లీజండి మా మధ్య ఏదీ లేదు" అన్నాడు. నిజమే మేం అంటున్నదీ అదే కదా మీ మధ్య 'ఏదీ' లేదు. అంతా క్లోజే అని విట్లు విసురుతున్నారట డియోల్ విమర్శకులు.

సెపరేట్‌గా కేటాయించి మరో ముఖ్యమైన విషయం ప్రబోధించాడు.

"నువ్వురేపు హీరోయిన్‌వి అవుతావు. అప్పణ్నుంచి నువ్వు నమ్ముకో వలసింది, పొద్దుటలేచి దండం ఎట్టుకోవలసింది ఏ దేవుడికో తెలుసా ఏడు కొండల ఎంకటేస్వరుడికి, సిమ్మాద్రి అప్పన్నకీ, మరో దేవుడికీ కాదు. ఇదిగో ఈ ఉబ్బినిబిల్లి సుబ్బయ్య నాయుడికి! ఎందుకంటే నిన్ను హీరోయిన్ని చేస్తున్నది నేను. అంచేత నేనే నీ దేవుణ్ణి అర్ధమైందా?"

అర్ధమైంది అన్నట్టుగా తల ఆడించింది. రేపుట్నించీ నువ్వు నడావల్సింది గవుర్మెంటోళ్లు వేసిన రోడ్డుమీద కాదు, నా మాటమీదే నడుచుకోవాలి అన్నాడు. ఆ మాటకీ తల ఆడించింది. సినిమాల్లో కొచ్చాక ఏ హీరోయిన్ ఎవర్ని పెళ్లాడి జీవితాంతం కాపురం చేసి అందరిచేతా శెభాష్ అనిపించుకుందో చెప్తూ, ఉదాహరణలుగా ఓ ఆరేడుగురు పేర్లు చెప్పాడు దాంతోపాటు మొగుణ్ణి కళ్లుమూసి జెల్లకాయకొట్టి మరొకడితో జెండా ఎత్తేసిన వాళ్ళగురించి తర్వాత వాళ్లు పడిన బాధల గురించి, వాళ్లు చచ్చిన దిక్కుమాలిన చావులగురించి చెప్తూ పాతిక ముప్పైమందిని ఆవిడకి వుదాహరణలుగా చెప్పేడు. అతను కాళ్లకి నమస్కారం కూడా చేసింది. దాంతో సుబ్బయ్య నాయుడి మనసు ముక్కలలోకంలో రెక్కలు కట్టుకొని, సినిమాపక్షి లాగ ఎగరసాగింది.

* * *

ప్రెస్‌మీట్ జరుగుతోంది!

చాలామంది జర్నలిస్టుల్ని పిలిచాడు! అందరు జర్నలిస్టులు సుబ్బయ్యనాయుడికి బాగా తెలిసిన వారే. టీపార్టీ గూడా ఘనంగా ఏర్పాటుచేశాడు. వాళ్లు తనని పెద్దగా ప్రశ్నలడక్కూడదని ఫెండ్సిప్పు కొద్దీ చిన్నచిన్న ప్రశ్నలడుగుతారనే అనుకున్నాడు. కానీ ఇంటర్వ్యూ చేసేటప్పుడు వాళ్లు నిర్మొహమాటంగా అడగాల్సిన ప్రశ్నలు అడిగి సుబ్బయ్యకి చెమటలు పట్టించేసారు. అయినా సుబ్బయ్య కూడా ఆ ఇంటర్వ్యూలో యిదిగో, యీ పద్ధతిలో ధైర్యంగానే జవాబులు చెప్పాడు.

ప్రశ్న: కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బు బిళ్లలు కూడా, కవితా వస్తువులుగా పనికొస్తాయని మహాకవి శ్రీశ్రీగారు ఏనాడో నిర్ణయించేసారు కాబట్టి, డబ్బున్న ప్రతివాడు నిర్మాతగా మారొచ్చు, సిన్మాలు తీయొచ్చు. అంతవరకు ఒక్కే! కానీ, మీరు మీ సిన్మాని డైరెక్ట్ చేస్తున్నానంటున్నారు. మీరింత వరకు చేసింది ప్రొడక్షన మేనేజర్ పని, మీరు ఏ డైరెక్టర్ దగ్గరైనా అసిస్టెంట్‌గా పనిచేసారా?

సుబ్బయ్య గొంతు సకిలించి, మంచినీళ్లు తాగి, 'అక్కర్లేదు' అన్నాడు.

"అక్కర్లేదూ అంటే, ఏవిటక్కర్లేదు?"

"డైరక్టు అవాలంటే కంపల్సరీగా ఓ డైరక్టుగా పన్చేయనక్కర్లేదు. ఆనాట్నుంచి, యీ నాటిదాకా చాలా గొప్పగొప్ప డైరెక్టర్లు, డైరట్‌గానే సినిమాని డైరెట్ చేసేసి, రికార్డులు గూడా సృష్టించారు. మాటవర్సకి కొంతమంది కాలేజీకెళ్లి మేష్టర్ల దగ్గర నదివి బి.ఎ పాసవుతారు. కానీ మరికొంతమంది యింటి దగ్గర కూకునే పుస్తకాలు నదివి బి.ఏ పాసవుతారు. రెండు బి.ఏ డిగ్రీలు ఒక్కలాగే చెలామణీ అవుతాయి గదా! ఎటొచ్చి డైరెక్టర్‌కి కావాల్సింది బుర్రండీ బుర్ర. ఆ బుర్రేదో నాకుందని నా నమ్మకం.

మరో జర్నలిస్టు అడిగాడు. అది సరే! మీకు పెద్దగా చదువు లేదని మీరు చెప్పేరు. మాకు అర్ధమై పోయింది, మీ సినిమాకి, మీరే కథ రాసానంటున్నారు....

"మీకు తెలవంటేటుందండి? సినేమాకి కతలు రాయరండి. తయారు చేస్తారు. లేదా నలుగురు కూకుని వండుతారు కొంతమంది రైటర్లు మాత్రం కాగితాల మీద రాసుకుంటారనుకోండి! నేనూ అట్టాగే రాద్దామనుకున్నానుగాని నాకు కాస్తా బాసా దోసాలు వస్తాయని నా కతని నోటితో చెప్తేస్తున్నాను. అసిస్టెంట్ డైరెక్టర్లు కాయితాల మీద రాస్తేస్తున్నారు. అయినా యిక్కడో పాయింట్ వుందండి.ఈ సినేమా ఫీల్డులో తింటానికి తిండి

లేనోడు వుండొచ్చు, కట్టుకోవడానికి బట్టల్లేనోడు వుండొచ్చు. కానీ చేతిలో కథలు లేకుండా ఎవుడూ లేడండి! అట్టాగే నా దగ్గరకూడా కొన్ని కథలున్నాయ్" ఆమాట చెప్పిన సుబ్బయ్య బాగానే జవాబు చెప్పేననుకున్నాడు.

ఓ ఆడ జర్నలిస్టు, చిన్నగా నవ్వుతూ అడిగింది. "సినిమాకి కథేప్రాణం అంటారు. మరలాంటి కథని ఎవరైనా అనుభవం వున్న పెద్ద రచయిత చేత రాయిస్తే బాగుంటుంది గదా"

"బాగుంటుంది. కానీ ఆళ్లు అడిగే రేటు బాగోదు. ఇవాళ్టిరోజుల్లో పది కేసెట్లు చూసి వాటిల్లోంచి కొంత వీటిల్లో మంచి కొంతతీసి కొత్త కథని చాలామంది తయారు చేస్తున్నారు. అలాంటప్పుడు ఆ తంటాలోవో నేనే పడుతే నేనూ నా కథని తయారు చేసుకోవచ్చుకదా"

సుబ్బయ్య చెప్పేగడుసు సమాధానాలకి జర్నలిస్టులు రవంతగూడా ఆశ్చర్యపోకుండా మరింత వుత్సాహంగా అడిగారు.

"మీరు సినిమా కథ గురించి అంత తేలిగ్గా చెప్తుంటే మీకుండే గుండె ధైర్యం, ఈ ఫీల్డులోని గొప్ప రచయితలకి ఎందుకు లేకుండా పోయిందా, కథ కోసం రాత్రింబగళ్లు బుర్రలు బద్దలగొట్టుకుంటూ ఆలోచిస్తున్నారా అనిపిస్తోంది"

సుబ్బయ్య కొద్దిగా ఖంగుతిని గుటకలు మింగేడు! మరో విలేఖరి కాస్త సీరియస్‌గా అడిగాడు. "మీకు భాష సరిగా రాకపోవడం వల్ల కథల్ని అయితే నోటితో చెప్పేస్తానన్నారు. కానీ డైలాగ్స్ రాయడానికి, పాటలు రాయడానికి మంచి భావుకత వుండాలి, మీ వూహాకి అక్షరరూపం కల్పించడానికి కొద్దోగొప్పో తెలుగుభాష తెలిసుండాలి కదా?"

సుబ్బయ్య నాలుగైదు క్షణాలపాటు ఆలోచించి అన్నాడు.

"అక్కర్లేదండి. ఒక రచయిత ఓ మాటరాసినా, ఓ పాట రాసినా దానికి బుర్ర వుండాలండి. ఒప్పుకుంటాను. కానీ తెలుగుభాష తెలిసుండాలనే రూలేం లేదండి. ఎందుకంటే ప్రపంచికం అంతట్లోకి గొప్ప నాటక రచయితలు ఎవరూ అని అడిగితే ఆయనెవరో ఇంగ్లీష్ రచయిత పేరు చెప్తారండి. ఆపేరు, నోట్లో ఆడుతున్నాది గాని బైటకిరాడం లేదు" అంటూ ఆ నాటక రచయిత పేరు జ్ఞాపకం తెచ్చుకోడానికి బుర్రగోక్కున్నాడు. అతని ఇబ్బంది గమనించి ఒక జర్నలిస్టు–

'షేక్స్పియరా?' అన్నాడు.

కరట్టు, కరట్టు, అతగాడే, అతగాడే. మరంత గొప్ప నాటక రచయితక్కూడా తెలుగుబా రాకనేగదా నాటకాలన్నీ ఇంగ్లీషులో రాసేసాడు. అంతదాకా ఎందుకండి! మహాకవి కాళిదాసు పేరు మీరు వినేవుంటారు. ఆకాళిదాసు జీవితాన్ని సినిమాగా తియ్యడం, మన నాగేశ్వర్రావుగారుయెయ్యడంగూడా జరిగింది గదా! అతగాడూ గొప్పగొప్ప పుస్తకాలే రాసేడట. కానీ అతగాడు ఇండియాలో పుట్టి, ఇండియాలో పెరిగి కూడా తెలుగు బాసరాక సంస్కృతంలో రాసేసాడు. ఆయనే కాదండి. జయదేవుడనే కవి అనేవో అష్ట పదులో, యిష్ట పదులో, కష్టపదులో ... ఏవైతే ఏటిలెండి! మొత్తంమీద పదులు అనే పేరొచ్చే పాటలు రాసే డట! ఆయన స్టోరీని కూడా సినేమాగా తీసేరు. ఆ కేరెక్టర్‌కూడా మన నాగేశ్వర్రావుగారే వేశారు. ఆ జయదేవుడి పాటల్నికూడా మనం తెలుగు సినిమాలో వాడేసుకున్న ఆయనగారికి తెలుగుబాస రాకే సంస్కృతంలో రాసేసాడట. అలాంటప్పుడు నాబోటోడికి తెలుగు బాసవస్తే ఎంత? రాకపోతే ఎంత? పైగా యియ్యాల్టి రోజుల్లో సినేమా పాటలు ఎట్టావున్నాయో మీకు తెలియందేముంది? ఏవో కొన్ని మంచి పాటలు అడపాతడపా వస్తున్నా మిగతా పాటలన్నీ వుత్తగోలగోలే కదండి! అంచేత ఆ మాత్రం పాటలు నేను రాయలేనా? అని తెగించి దిగిపోయేనండి"

జర్నలిస్టులు మనసుల్లో "మొండివాడు రాజు కంటే బలవంతుడు" గదాఅని అనుకున్నట్టున్నారు. సుబ్బయ్యని వదిలేసి కాకినాడ కళారంజనీని ఇంటర్వ్యూ చేసారు. ఆవిడ చేత సుబ్బయ్య నాయుడు అల్‌రెడీ రిహార్సల్సు చేయించడం వల్ల జాగ్రత్తగానే జవాబు చెప్పింది. కానీ, మీరు ఏ మీడియంలో చదువుకున్నారు? అని అడిగినప్పుడు మాత్రం తత్తరపడి "నేను మొత్తం సదివిందంతా కాన్వెంట్‌లోనే" అంది.

కాన్వెంటా అని ఓ విలేఖరి రెట్టించి అడిగితే సుబ్బయ్య గబుక్కునని అందుకుని సర్దిచెప్పేడు.

"కాన్వెంట్ కాదండీ... కాన్వెంట్! కాన్వెంట్ ఈవిడ కొన్నాళ్లపాటు బెంగాల్లో కూడా సదివింది లెండి! అక్కడ బాస మీకు తెల్సుగదా! వెంకటరావ్ అంటానికి బదులు బెంకట్రావ్ అంటారు. వరండా అంటానికి బదులు బలండా అంటారు. అట్టాగే యిక్కడ మనం కాన్వెంట్ అనేదాన్ని అక్కడ కాన్వెంట్ అంటారనుకుంటాను"

ఓ అరగంట సేపు ప్రెస్‌మీట్ యిలాగే సాగింది.

* * *

కొంత డబ్బున్న వాడికి, మరికొంత డబ్బు ఎవరైనా అప్పిస్తారు. కానీ, ఏమీలేని వాడికి ఎవరూ ఏమీ అప్పివ్వరు. ఇది ఎక్కడైనా జరిగేదే. సినిమా రంగంలో కూడా అదే జరుగుతోంది! కళారంజని సినిమాకి కేపిటల్ ఎమౌంట్ దిట్టంగానే పట్టుకొచ్చింది. కాబట్టి సుబ్బయ్యనాయుడు తన పలుకుబడి ఉపయోగించి ఫైనాన్సర్ల దగ్గర్నుంచి అప్పు పుట్టించాడు. త్వరలోనే సినిమాని పూర్తిచేశాడు. త్వరలోనే రిలీజ్ చేశాడు. టీ.వి, అన్ని ప్రైవేట్ ఛానల్స్‌లోనూ పబ్లిసిటీ అదరగొట్టేసాడు. కానీ సినిమా విడుదలయిన అతి త్వరలోనే ఫిలిమ్ డబ్బులు కూడా తిరిగొచ్చేసాయి. అయినా టీవీల్లో ఇంకా పబ్లిసిటీ సాగుతూనే వుంది. టీవీ వాళ్లకి డబ్బుకడుతూనే వున్నాడు. ఒకరోజు అతనికి ఎవడో పేరులేని వ్యక్తి వుత్తరం రాసాడు.

"ఒట్టి గొడ్డుకి అరుపులెక్కువ. సరుకులేని సినిమాకి పబ్లిసిటీ ఎక్కువా అని, ఎక్కడా ఆడ్డంలేని సినమాకి పబ్లిసిటీ ఎందుకురా? అంటూ అసభ్యమైన భాషతో రాసిన ఆ వుత్తరాన్ని చదివాక పబ్లిసిటీ ఆపేసాడు!

ఈ కథకి యిదికాదు ముగింపు! మరొకటుంది.

ఉబ్బివిబిల్లి సుబ్బయ్య నాయుడు ఏదోఒక పని మీద పది రోజులపాటు శ్రీకాకుళం వెళ్లి తిరిగొస్తుండగా ట్రైన్లో కాలక్షేపంకోసం దినపత్రిక కొన్నాడు. సినిమా పేజీచూసి అందులో పడిన న్యూస్ చదివి ట్రైన్లో బాంబు పేలినట్టుగా అదిరిపడ్డాడు. 'ఖాన్ అబ్దుల్ బుల్‌బుల్‌ఖాన్' నిర్మాతగా కాకినాడ కళారంజని ఓ -సినిమాని నిర్మించబోతుంది. ఆ చిత్రంపేరు "కళ్లుమూసి జెల్లకొట్టు!" ఆ చిత్రానికి కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లే, డేన్స్ అండ్ దర్శకత్వం –కుమారి కళారంజని.

ఆ వార్త చదవడంతోనే ఉబ్బివిబిల్లి సుబ్బయ్య నాయుడు కరెంట్ షాక్ తిన్న కాకిలాగ గిలగిల్లాడిపోయాడు!



## 'నానా' బాధలు

నానా పటేకర్ నానా బాధలు పడుతూ బాడీ బిల్డింగ్ మొదలెట్టాడు. అగ్నిసాక్షిలో మనీషా కోయిరాలను అవలీలగా రెండు చేతులా ఎత్తేసిన జాకీ షరాఫ్ ఆమె ప్రశంసలు అందుకున్నాడు. "మరి నీకంతా సీనుందా" అని ప్రైవేట్ సంభాషణల్లో మనీషా అడిగిందట. దాంతో నానా రెచ్చిపోయి బాడీ బిల్డింగ్ మొదలెట్టాడు. ఎంతయినా ఎత్తు పల్లాలు ఎరిగిన నటుడు కదా! ఏదయినా చేస్తాడు.